క్లుప్తంగా

మత్స్య, కూర్మావతారాల్లో జగన్నాథుడు



గుండిచా మందిరంలో పూజలు అందుకుంటున్న జగన్నాథ స్వామి

బలిజిపేట: జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు సోమవారం స్వామివారిని మత్స్య, కూర్మావతారాల్లో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు ఆర్.పార్థసారథి, సురేష్‌లు గుండిచా మందిరం వద్ద స్వామివారికి అవతారాలను మార్పుచేసి పూజాకార్యక్రమాలు చేశారు. రోజువారీ స్వామివారికి ప్రసాదాలతో నైవేద్యాలు సమర్పించారు. గుండిచా మందిరం వద్దకు గ్రామంలోని భక్తులు వచ్చి పూజాకార్యక్రమాలు చేసి స్వామిని దర్శించుకున్నారు. భక్తులచేత అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు.

మక్కువలో ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు



వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తున్న ఈవో శ్రీనివాస్

మక్కువ: మండలకేంద్రం మక్కువలోని పలువీధుల్లో సెన్సార్ ఎల్‌ఈడీ లైట్లను సర్పంచ్ ఒంటి రామలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మక్కువలోని ప్రధాన వీధి, బీసీకాలనీ, జగనన్నకాలనీ, రజకుల వీధితో పాటు, ఇతర వీధుల్లో ఏర్పాటు చేయగా, సోమవారం జంగాల వీధి, బల్లంకివీధి, గంట్యాడ వీధి, కర్ణాలవీధి, రామిరెడ్డి వీధుల్లో సెన్సార్‌లైట్లను ఈవో బెహరా శ్రీనివాస్ పర్యవేక్షణలో ఏర్పాటుచేశారు.

రేకుల షెడ్‌లో ప్రాథమిక పాఠశాల



బొర్రమామిడి వలస పాఠశాల

సాలూరు రూరల్: మండలంలోని తోణాం పంచాయతీ బొర్రమామిడి వలస గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలను రేకులషెడ్డులోనే చుట్టూ తడకలు కట్టి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. వర్షం పడితే పాఠశాల చుట్టూ నీళ్లు చేరుతున్నాయి. దీంతో ఏక్షణం ఏ పురుగు వస్తుందోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. శాశ్వత భవనం మంజూరు చేయాలని పలుమార్లు అధికారులకు అర్జీలు పెట్టినప్పటికీ పట్టించుకున్న పాపాన లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆధార్‌లో సవరణ చేయండి



కలెక్టరేట్ వద్ద తన సమస్యను వివరిస్తున్న పి.శంకర్రావు

పార్వతీపురంటౌన్: ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు పి.శంకర్రావు, వయస్సు 65ఏళ్లు. తనకు ఆధార్ కార్డు మంజూరు చేసే సమయంలో ఆపరేటర్స్ తప్పిదం కారణంగా వయస్సు తక్కువగా వేశారని, యదార్థ వయస్సు కన్నా ఆధార్‌లో తక్కువ వయస్సు కలిగి ఉండడం చేత వృద్ధాప్య పింఛన్ మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు తన సమస్యను వివరించేందుకు కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశాడు.

ఏఎన్‌ఎం పోస్టులను భర్తీ చేయాలి




మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ ఎల్.మణి తదితరులు

పార్వతీపురం: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో తక్షణమే ఏఎన్‌ఎం పోస్టులను భర్తీచేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ ఎల్.మణి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలోని రెండు ఐటీడీఏల పరిధిలో దాదాపు 55 గిరిజన ఆశ్రమ పాఠశాలలున్నాయని, గిరిజనశాఖలో ఏఎన్‌ఎం పోస్టులను భర్తీ చేస్తానని మంత్రి మొదటి సంతకం చేసినప్పటికీ ఇంతవరకు దాని ఊసు ఎక్కడా లేదన్నారు. దీనికి గిరిజన విద్యార్థుల పట్ల ప్రభుత్వ వైఖరికి ఇది నిదర్శన మన్నారు. గిరిజన విద్యార్థులు అనారోగ్యంతో బాధ పడుతుండడంతో పాటు మృత్యువాత పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే ఏఎన్‌ఎంలను భర్తీచేసి గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు దేవి, చరణ్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశు వైద్యకేంద్రాలు





శిథిలావస్థకు చేరిన బగ్గందొరవలస పశువైద్యకేంద్ర భవనం, (ఇన్‌సెట్లో)శ్లాబ్ నుంచి కారుతున్న నీరు

సీతానగరం: మండలంలోని పశువైద్య కేంద్రభవనాలు శిథిలావస్థకు చేరడంతో వైద్యసేవల నిమిత్తం రైతులు పశువులతో రాగా వైద్య సేవలందించడానికి వైద్యులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ ప్రాణభయంతో సేవలందిస్తున్నారు. మండలంలోని సీతానగరం,బూర్జ, నిడగల్లు, గుచ్చిమి, కె సీతారాంపురం, బగ్గందొర వలస గ్రామాల్లో పశు వైద్య కేంద్రాలున్నాయి. ఆయా ఆస్పత్రుల పరిధిలోని గ్రామాల్లో రైతులు 15,182మంది ఉండగా పాడి ఆవులు 1960 పాడి గేదెలు,గొర్రెలు 19,103, మేకలు 6,395, కోళ్లు 42.351, పందులు 621 ఉన్నాయి.వాటన్నింటికీ సేవలందించడానికి వైద్యులున్నారు. భవనాల కొరత వెంటాడుతున్నందున డాక్టర్లు,సిబ్బంది ఇబ్బందులు పడుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారు. అలాగే బగ్గందొరవలస జంక్షన్‌లో ఉన్న పశువైద్య భవనం శిథిలావస్థలో ఉండడం, శ్లాబ్‌పై నీరునిల్వ ఉండిపోతూ నానిపోయిన శ్లాబ్ వర్షం నీరు చిమ్మడం, గోడల నుంచి నీరు చిమ్మడంతో ఎప్పుడు కూలిపోతుందోనని భయాందోళన చెందుతున్నారు. భవనం చుట్టూప్రహరీ ఉన్నా ఆస్పత్రి ప్రాంగణంలో కురిసిన వర్షపు నీటిని మళ్లించడానికి సౌకర్యం లేదు. బురదకారణంగా పశువులను లోపలికి వైద్యం కోసం తరలించడానికి ఇబ్బందులు పడుతున్నామని వైద్యులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుచ్చిమి పశువైద్య భవనం, సీతానగరం పశువైద్య భవనం శిథిలమయ్యాయని నూతన భవనాలు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పిచ్చి మొక్కలతో పశువైద్యశాల

నిధుల కోసం ప్రతి పాదనలు..



మండలంలో శిథిలమైన భవనాల స్థానంలో నూతన భవనాల నిర్మాణం నిమిత్తం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదించాం. బగ్గందొరవలస పశు వైద్య భవనం మరమత్తుల నిమిత్తం రూ.6లక్షలు మంజూరు చేయాలని, నూతన భవనం నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ప్రతిపాదించాం, నిధులు వచ్చినవెంటనే పనులు చేపట్టనున్నాం. – డాక్టర్ ఎస్.రామారావు,మండల పశువైద్యాధికారి,సీతానగరం

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు డాక్టర్ కృష్ణంనాయుడు శ్రీరాములునాయుడు

సీతానగరం: వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా అందరం పనిచేయాల్సిన అవసరం ఉదని డీసీసీబీ మాజీడైరెక్టర్, డాక్టర్ అంబటి కృష్ణంనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బలగ శ్రీరాములునాయుడు అన్నారు. ఈ మేరకు పార్టీ మండల కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీ బలోపేతం చేయడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, బక్కుపేట మాజీ సర్పంచ్ బక్కు సూర్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు ఆర్వీ కిషోర్‌కుమార్, బి.ముకుందరావు, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళా సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ మజ్జి శోభారాణి

పార్వతీపురం రూరల్: గ్రామ సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమైనదని పంచాయతీ అభివృద్ధిలో సర్పంచే కీలకమని పార్వతీపురం ఎంపీపీ మజ్జి శోభారాణి అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రారంభమైన మహిళా సర్పంచ్‌ల శిక్షణ తరగతులను ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిపాలనలో ఉండాల్సిన మెలకువలపై శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. మహిళా సర్పంచ్‌ల అధికారాలు, వారికి కేటాయించిన హక్కులు తదితర విషయాలపై శిక్షణ తరగతులకు హాజరై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, డిప్యూటీ ఎంపీడీఓ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్స్‌కు అదనపు భవనాలు ఏర్పాటుచేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్



జాయింట్ కలెక్టర్ శోభికకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పార్వతీపురం టౌన్: ఎస్టీ బాల, బాలికల హాస్టల్స్‌కు అదనంగా భవనాలు ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.రాజు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అయన జిల్లా కేంద్రంలో ఎస్టీ, కాలేజీ హాస్టల్స్‌కు అదనంగా భవనం నిర్మించాలని, ఎస్సీ, బీసీ కాలేజీ హాస్టల్స్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు హెచ్.సింహాచలం, కె.డేవిడ్ జిల్లా కమిటీ సభ్యులు జి.సురేష్, కె.రాజేష్ పాల్గొన్నారు.

మూలకు చేరిన జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్



కురుకుట్టిలోని జీడిపిక్కల ప్రాసెసింగ్ సెంటర్

సాలూరు రూరల్: మండలంలోని కురుకుట్టి, వెలగవలస గ్రామాల్లో ఏర్పాటు చేసిన జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు మూలకు చేరాయి. ఈ కేంద్రాల ద్వారా జీడిపిక్కలు ప్రాసెసింగ్ చేసి స్థానిక గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేస్తామని ఊదరగొట్టిన కూటమి నాయకులు ఇప్పుడు ఈ కేంద్రాలను తెరిపించలేక పోయారు. ఇటీవల కలెక్టర్ ఈ కేంద్రాలను పరిశీలించి వీటికి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పి మహిళా సంఘాల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేయించారు. అయితే ఇప్పుడు పార్వతీపురంలో ఏర్పాటు చేసిన జీడిపిక్కల ప్రాసెసింగ్ కేంద్రానికి జీడిపిక్కలు అమ్ముకోవాలని ప్రభుత్వం సూచించడంతో కొనుగోలు చేసిన జీడిపిక్కలు అంతదూరం తరలించలేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.

వైద్యాధికారులు గ్రామాల వైపు చూడాలి



గ్రామస్తులతో కలిసి మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు పి.రాము

పార్వతీపురం రూరల్: మండలంలోని గంగాపురం పంచాయతీ తాన్నవలస గ్రామంలో గిరిజనులు విషజ్వరాలతో సతమతమవు తున్నారని, నేటికి వారం రోజులు కావస్తున్నా సంబంధిత ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యులు కానీ, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, తదితర వైద్యసిబ్బంది గ్రామం వైపు చూడడం లేదని సీపీఎం మండల అధ్యక్షుడు పి.రాము తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆ గ్రామాన్ని సందర్శించిన ఆయనకు గ్రామస్తులు జ్వరాలతో బాధపడుతున్న విషయాన్ని తెలియజేశారు. వైద్యసిబ్బంది గ్రామానికి రాకపోవడంతో భయాందోళనతో డబ్బులు ఖర్చుపెట్టి ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నామని వాపోయారు. తక్షణమే ఐటీడీఏ పీఓ దృష్టి సారించి తాన్నవలసకు వైద్యసిబ్బందిని పంపాలని, అలాగే వారికి మెరుగైన వైద్యం అందించి దోమతెరలు పంపిణీ చేయాలని గ్రామంలో స్ప్రేయింగ్ చేయాలని సీపీఎం మండల అధ్యక్షుడు పి.రాము డిమాండ్ చేశారు. లేకుంటే కలెక్టరేట్ వద్ద గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడతామన్నారు.

వరాహ స్వామి అవతారంలో జగన్నాథుడు



పార్వతీపురం టౌన్: జగన్నాథ స్వామివారి రథోత్సవాల సందర్భంగా స్వామివారు నాల్గవ రోజు శ్రీ ఆదివరాహస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు ఆలయ అర్చకులు శశిభూషణ్ పండా, రవీంద్ర పండాలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో బారులు దీరారు. రథయాత్ర మహోత్సవం సందర్భంగా 9రోజుల పాటు స్వామివారు వివిధ రూపాల్లో దర్శనమిస్తారని అర్చకులు తెలిపారు.

జగనన్న, రాజన్నదొరలకు ధన్యవాదాలు



రాజన్నదొరకు ధన్యవాదాలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా అనుబంధ కమిటీ సభ్యులు

సాలూరు: వైఎస్సార్‌సీపీ సాలూరు మండల సోషల్ మీడియా అనుబంధ విభాగ కమిటీలో నియమించినందుకు పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరలకు సోషల్‌మీడియా కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.ఈ మేరకు సోమవారం రాజన్నదొరను పట్టణంలోని ఆయన స్వగృహంలో వారు కలిశారు.తమపై ఎంతో నమ్మకంతో ఉంచిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తామని తెలిపారు. అనంతరం రాజన్నదొరను దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, నియమనిబంధనలకు అనుగుణంగా ప్రజలకు వాస్తవాలను తెలియచేయాలని సూచించారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు మంజూరుచేయండి

- కలెక్టరేట్ వద్ద గ్రామ సమస్యలు తెలుపుతున్న గోపాలపురం సర్పంచ్ పెండ స్రవంతి



పార్వతీపురం టౌన్: మండలంలోని గోపాలపురం గ్రామినికి ఓవర్‌హెడ్ ట్యాంకు మంజూరు చేయాలని సర్పంచ్ పెండ స్రవంతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

రెండు గ్రామాల్లో పూర్తి కావచ్చిన రీ సర్వే పనులు



తహసీల్దార్ ప్రసన్నకుమార్

సీతానగరం: మండలంలో సమగ్ర రీసర్వే పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి సిద్ధం చేశామని తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మండల సర్వేయర్ ఆధ్వర్యంలో రెండో విడతలో బల్లకృష్ణాపురం, దయానిధిపురం గ్రామాల్లో రీసర్వే చేపట్టామన్నారు. ఇప్పటివరకూ రైతుల జిరాయితీ భూముల రికార్డుల పరిశీలన, భూములను భౌతికంగా పరిశీలించినట్లు తెలిపారు. పనులు పూర్తి కావడంతో వీఆర్వో, గ్రామసర్వేయర్ లాగిన్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. నిర్దేశించిన రెండుగ్రామాలకు సంబంధించిన సర్వేపూర్తయిన తరువాత మరో రెండు గ్రామాల్లో రీసర్వే పనులు ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్‌టీసీలో అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ, ఆర్టీసీ యూనియన్ నాయకులు

పార్వతీపురంటౌన్: ఆర్‌టీసీలో అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం డిపోలో సుమారు 33 అద్దె బస్సులలో 70 మంది డ్రైవర్లు పనిచేస్తున్నారన్నారు. వారికి టెండర్లో పేర్కొన్న విధంగా లేబర్ చట్టాలు, వేతనాలు అమలు కావడం లేదని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు లేవని, అద్దె బస్సుల డ్రైవర్ల సమస్య పరిష్కారం చేసి లేబర్ చట్టాలు, వేతనాలు ఈఎస్ఐ, పీఎఫ్, జీతాల సమస్య పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగుడినైనా పింఛన్ లేదు.



కలెక్టరేట్ వద్ద తన సమస్య వివరిస్తున్న దివ్యాంగుడు పి.నాగభూషణ్

పార్వతీపురం టౌన్:

పట్టణంలోని 21వ వార్డుకు చెందిన పి. నాగభూషణ్‌కు రెండు చెవులు పూర్తిగా వినికిడి శక్తిని కోల్పోయాయి. కరోనా సమయంలో ఆయన భార్య చనిపోయింది. తనకు పింఛన్ కావాలంటూ ఎన్నో ఏళ్లుగా సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం దక్కలేదని సోమవారం కలెక్టరేట్ వద్ద తన సమస్య తెలిపి కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశాడు. ఎన్నో మార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని వాపోయాడు. ఎటువంటి పెన్షన్ మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు ఇద్దరు చిన్న పిల్లలున్నారని కుటుంబ పోషణ కష్టంగా ఉందని తనకు పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశాడు.

నేడు సర్వసభ్య సమావేశం

పార్వతీపురం రూరల్: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ జి. రమేష్ బాబు తెలిపారు. ఈ మేరకు సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. మండల అధికారులు సమస్యలపై, అభివృద్ధిపై పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

కృష్ణాజీ మాస్టారు సేవలు ఎనలేనివి

పాచిపెంట: పాచిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అధ్యాపకుడు కృష్ణాజీ మాస్టారు సేవలు ఎనలేనివని ఎంపీపీ బి.ప్రమీల అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కృష్ణాజీ మాస్టారు ఉద్యోగ విరమణ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, ఆధ్యాత్మికవేత్తగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. గతంలో పనిచేసిన పాఠశాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



సన్మానం పొందుతున్న శ్రీరాములు దంపతులు

పార్వతీపురం రూరల్: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులకు సమాజంలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎంఈఓ-1 యందవ విమల కుమారి అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని బాలగుడబ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు మర్రాపు శ్రీరాములు సన్మాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన శ్రీరాములు, నిర్మల దంపతులను పూలమాలలు, దుశ్శాలువతో ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన శ్రీరాములు మాట్లాడుతూ 36 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా వివిధ ప్రాంతాల్లో పనిచేసి విద్యార్థులకు బోధన చేయడం ఎంతో సంతృప్తి నిచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కె. ప్రసాదరావు, ఉపాధ్యాయులు జి. ప్రభాకరరావు, సహోపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగానికే



ప్రసాదరావు దంపతులను సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

పదవీ విరమణ ఉద్యోగానికే తప్ప జీవితానికి కాదని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని నర్సిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన ఎం.ప్రసాదరావు దంపతులను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాయితీగా విధులను నిర్వహించి విద్యార్థుల మన్ననలను పొందారని ప్రసాదరావును ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బోను సత్యనారాయణ మాట్లాడుతూ ఆంగ్ల భాష ఉపాధ్యాయుడిగా పనిచేసి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లిష్‌పై మక్కువ వచ్చేలా బోధన చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.